క్లుప్తంగా

సంతాపం

పాలకొండ: నగర పంచాయతీ చైర్‌పర్సన్ యందవ రాధాకుమారి భర్త వాన నాగేశ్వరరావు శుక్రవారం ఉదయం గుండె పోటుతో మృతి చెందారు. స్వగ్రామం పాతపట్నంలో ఆయనకు గుండె పోటు రావడంతో శ్రీకాకుళం జెమ్స్ ఆస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ శుక్రవారం ఉదయం మృతి చెందారు. నాగేశ్వరరావు పాతపట్నం మండల సర్వేయరుగా పని చేస్తున్నారు. ఈయన మృతి పట్ల వైఎస్సార్ సీపీ సీనియర్ నాయకుడు పాలవలస రాజశేఖరం, ఎమ్మెల్యే విశ్వాసరాయి కళావతి, ఎమ్మెల్సీ పాలవలస విక్రాంత్‌తో పాటు నగర పంచాయతీ కౌన్సిల్ సభ్యులు సంతాపం తెలిపారు.

చురుగ్గా ఆధార్ అప్‌డేట్


ఆధార్ అప్‌డేట్ చేస్తున్న సిబ్బంది

సీతంపేట: మండలంలోని సోమగండి గ్రామ సచివాలయం పరిధిలో ఏర్పాటు చేసిన ఆధార్ అప్‌డేట్ కార్యక్రమం చురుకుగా సాగుతుంది. కొండ శిఖర గ్రామాల నుంచి వస్తున్న గిరిజనులు ఆధార్ అప్‌డేట్ చేయించుకుంటున్నారు. పేర్లు, జిల్లాలు, వేలిముద్రలు వంటివి సరిచేసుకుంటున్నట్టు సిబ్బంది తెలిపారు.

యూటీఎఫ్ స్వర్ణోత్సవ సంబరాల జాతా


యూటీఎఫ్ స్వర్ణోత్సవ సంబరాల్లో సంఘ నేతలు

సీతంపేట: యూటీఎఫ్ స్వర్ణోత్సవ సంబరాలు రెండవ రోజు సీతంపేటలో ఘనంగా జరిగాయి. స్థానిక దోనుబాయి కూడలి వద్ద యూటీఎఫ్ జెండాను సీనియర్ నాయకులు పి.పద్మశ్రీ ఆవిష్కరించారు. రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ప్రసాద్ ఉపన్యసించారు. పతాక గేయాలను కె.గౌరునాయుడు బృందం ఆలపించింది. అనంతరం జాతా పాలకొండ, వీరఘట్టం మీదుగా పార్వతీపురం వెళ్లింది. కార్యక్రమంలో రాష్ట్ర కార్యదర్శులు, జిల్లా ఆఫీసు బేరర్లు, రాష్ట్ర కౌన్సిలర్లు, మండల నాయకులు పాల్గొన్నారు.

అంగన్‌వాడీ కేంద్రం పరిశీలన


అంగన్‌వాడీ కేంద్రాన్ని పరిశీలిస్తున్న ఎంఈఓ

జియ్యమ్మవలస: మండలంలోని వెంకటరాజపురంలో ఉన్న ఎంపీపీ పాఠశాల, అంగన్‌వాడీ కేంద్రాన్ని ఎంఈఓ 2 శ్రీనివాసరావు శుక్రవారం పరిశీలించారు. అంగన్‌వాడీ సెంటర్‌లో చిన్నారులకు అందుతున్న పౌష్టికాహారాన్ని పరిశీలించారు. మెనూ ప్రకారం గర్భిణులు, బాలింతలకు సరుకులు అందజేయాలన్నారు. గ్రామస్తుల నుండి ఎటువంటి ఫిర్యాదులు అందకుండా చూడాలన్నారు. ఆయనతో పాటు సీఆర్‌పీ సోమేశ్వరరావు ఉన్నారు.

అధికారుల దృష్టికి సమస్యలు

- వినతులు స్వీకరించిన జిల్లా అధికారులు

మక్కువ: మండల కేంద్రంలోని మండల పరిషత్ కార్యాలయంలో కలెక్టర్ నిషాంత్‌కుమార్ ఆధ్వర్యంలో అధికారులు శుక్రవారం జగనన్నకు చెబుదాం కార్యక్రమం నిర్వహించగా.. ప్రజలు వివిధ సమస్యలపై అర్జీలు సమర్పించారు. తమ ఇంటి మీద నుంచి విద్యుత్ తీగలు వెళ్తున్నాయని, వాటిని తొలగించాలని శంబర గ్రామానికి చెందిన అల్లు వెంకటరమణ.. గ్రామంలో మంచినీటి సమస్య నెలకొందని పుల్లేరువలసకి చెందిన మర్రి దాలమ్మ.. స్కూల్ నిర్మాణం వేగవంతం చేయాలని ఓ. పెద్దవలసకి చెందిన యువకులు.. భూమికి పాస్‌పుస్తకం మంజూరు చేయాలని మార్కొండపుట్టి గ్రామానికి చెందిన అల్లు గౌరునాయుడు.. డప్పు కళాకారుల పింఛన్ మంజూరు చేయాలని దబ్బగెడ్డ గ్రామానికి చెందిన కుప్పా గురువులు.. మక్కువ, భైరిసాగరం చెరువు చుట్టూ ఆక్రమణలు తొలగించాలని మావుడి. ప్రసాదరావు.. తదితరులు వినతులు అందజేశారు. మొత్తం 97 అర్జీలు అధికారులు స్వీకరించారు. కార్యక్రమంలో జేసీ గోవిందరావు, ఆర్డీఓ హేమలత, జిల్లా స్థాయి అధికారులు, ఎంపీడీఓ సూర్యనారాయణ, తహసీల్దార్ ఎ.సూర్యనారాయణ, తదితరులు పాల్గొన్నారు.


వినతులు స్వీకరిస్తున్న కలెక్టర్ నిషాంత్‌కుమార్

'జగనన్న ఆరోగ్య సురక్ష' సర్వే పరిశీలన


కన్నయ్యగూడలో ఆరోగ్య సర్వే సిబ్బందికి సూచనలిస్తున్న డాక్టర్ శ్యామ్

గుమ్మలక్ష్మీపురం: మండలంలోని ఇరిడి గ్రామ సచివాలయ పరిధిలోని కన్నయ్యగూడ గ్రామంలో జరుగుతున్న జగనన్న ఆరోగ్య సురక్ష సర్వే కార్యక్రమాన్ని పార్వతీపురం మన్యం జిల్లా ప్రత్యేక అధికారి, జిల్లా మలేరియా అధికారి డాక్టర్ శ్యామ్ శుక్రవారం పరిశీలించారు. సర్వేలో భాగంగా 30 సంవత్సరాలు వయసు పైబడిన వారందరికి బీపీ, షుగర్, రక్త శాతం, మూత్ర పరీక్షలు, డెంగీ, మలేరియా రక్త పరీక్షలు, కెల్ల పరీక్షలు ఆరోగ్య సిబ్బంది ఉచితంగా చేయాలని సర్వే సిబ్బందికి సూచించారు. ఆరోగ్య సిబ్బందితో పాటు గ్రామ వలంటీర్లు కలసి ప్రతీ ఇంటికి వెళ్లి వారిలో ఎవరైనా వ్యాధులతో బాధపడుతుంటే గుర్తించాలని అటువంటి వారికి ఆరోగ్య శిబిరాల్లో మెరుగైన చికిత్స అందించడం జరుగుతుందని తెలిపారు. అక్టోబర్ 5న ఇరిడి గ్రామంలో ప్రత్యేక వైద్యులతో ఉచిత ఆరోగ్య శిబిరాన్ని ఏర్పాటు చేస్తామని పేర్కొన్నారు. సర్వేలో హెచ్‌వీ యర్రాయమ్మ, ఆరోగ్య కార్యకర్తలు ఎస్వీ ప్రకాష్ గ్రామ సచివాలయం సిబ్బంది, గ్రామ వలంటీర్లు తదితరులు పాల్గొన్నారు.

పక్కాగా ఆరోగ్య సురక్ష సర్వే

పాలకొండ: జగనన్న ఆరోగ్య సురక్ష సర్వే సక్రమంగా చేయాలని అన్నవరం పీహెచ్‌సీ వైద్యాధికారి కమలనాథ్ అన్నారు. మండలంలోని సింగన్నవలస, కొండాపురం తదితర గ్రామాల్లో జరుగుతున్న ఆరోగ్య సురక్ష సర్వేను శుక్రవారం ఆయన పరిశీలించారు. 15 రోజుల పాటు సర్వే పూర్తి చేసి వైద్య శిబిరం నిర్వహించాలని తెలిపారు. ప్రభుత్వం ఈ కార్యక్రమం ద్వారా వైద్య నిపుణులతో తనిఖీలు చేపట్టి మందులు అందించేందుకు చర్యలు తీసుకుందని తెలిపారు. ప్రతి ఇంటికి వెళ్లి ఆరోగ్య సురక్ష ఆవశ్యకతను వివరించాలని సూచించారు.

రసాయన పరిశ్రమ వ్యర్థాలతో ఇబ్బందులు


రసాయన పరిశ్రమ వద్ద మాట్లాడుతున్న ఆయకట్టు రైతులు

కొమరాడ: మండలంలోని గంగారేగువలస గ్రామం జంఝావతి రబ్బర్ డ్యాం సమీపంలో ఉన్న రసాయన పరిశ్రమ విడిచిపెట్టే వ్యర్థాలు నేరళ్లబంద చెరువులో కలసి సాగునీరు కలుషితమవుతుందని దీంతో సుమారు 40 ఎకరాల పంట భూములు బీడు భూములుగా మారుతున్నాయని ఆయకట్టు రైతులు ఆందోళన చెందుతున్నారు. ఫ్యాక్టరీ సమీపంలో పలువురు రైతులు విలేకరులతో శుక్రవారం మాట్లాడారు. రసాయనిక వ్యర్థాల వల్ల పరిసర భూముల పంటలు దెబ్బతినడంతో పాటు వెదజల్లే వాయు కాలుష్యం వల్ల ఇబ్బందులు పడుతున్నామని ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికే కొన్ని భూముల్లో పంట సాగు చేయడం లేదని తెలిపారు. దీనిపై ఇప్పటికే కలెక్టర్‌కు ఫిర్యాదు చేశామని వెల్లడించారు. తగు చర్యలు తీసుకోవాలని ఆయకట్టు రైతులైన మరిశర్ల సింహాచలం, గంటా వెంకటనాయుడు తదితరులు కోరారు.

నేడు మండల సమావేశం

గరుగుబిల్లి: మండల పరిషత్ కార్యాలయంలో మండల సర్వసభ్య సమావేశం ఎంపీపీ ఉరిటి రామారావు అధ్యక్షతన శనివారం జరగనున్నట్టు ఎంపీడీఓ జి.పైడితల్లి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. సమావేశానికి ఎంపీటీసీలు, సర్పంచ్‌లు హాజరు కావాలన్నారు. మండల అధికారులు పూర్తి సమాచారంతో సమావేశానికి హాజరు కావాలని కోరారు.

26న వాహనాల వేలం

సీతంపేట: సారాతో అక్రమంగా రవాణా చేసి పట్టుబడిన వాహనాలను వేలం వేయనున్నట్టు ఎస్‌ఐ ఎ.నీలకంఠరావు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నెల 26న స్థానిక పోలీస్‌స్టేషన్ ఆవరణలో పాలకొండ డీఎస్పీ సమక్షంలో ఉదయం 10 గంటలకు ఒక ఆటో, మరో బుల్లెట్, 2 బైకులు వేలం వేయనున్నట్టు పేర్కొన్నారు. ఆసక్తి ఉన్న వారు హాజరు కావాలని కోరారు.

లక్ష్య సాధనకు పాటుపడాలి

గుమ్మలక్ష్మీపురం: బాలికలు మానసికంగా ధృడంగా ఉంటే అనుకున్న లక్ష్యాలు సాధించగలరని గుమ్మలక్ష్మీపురం డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ టి.శ్రీవరం అన్నారు. స్థానిక డిగ్రీ కళాశాలలో ఉమెన్ ఎంపవర్‌మెంట్ సెల్ కోఆర్డినేటర్ డి. లక్ష్మి ఆధ్వర్యంలో రాష్ట్రీయ కిశోర స్వచిత కార్యక్రమం శుక్రవారం నిర్వహించారు. కార్యక్రమంలో పాల్గొన్న భద్రగిరి సీహెచ్‌సీ అడాలసెంట్ హెల్త్ కౌన్సిలర్ వి.ప్రమీల మాట్లాడుతూ బాలికలకు మానసిక అభివృద్ధి, మానసిక పరిపక్వత ఎలా పెంపొందించుకోవాలో వివరించారు.

కార్యక్రమంలో అధ్యాపకులు వి.కల్పన, జి.తులసి, శ్రీవాణి, ఎన్ఎస్ఎస్ పీఓ త్రినాధ, వైస్ ప్రిన్సిపాల్ డి.రామయ్య పాల్గొన్నారు.

నేటి నుంచి టీచర్లకు శిక్షణ

సీతంపేట: ఐటీడీఏ పీఓ ఆదేశాల మేరకు ట్రైబుల్ వెల్ఫేర్ టీచర్లకు శనివారం నుంచి శిక్షణ ఇవ్వనున్నట్టు డిప్యూటీ ఈఓ ఎ.లిల్లీరాణి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. జాతీయ నూతన విద్యా విధానంపై విద్యను సులభంగా, సృజనాత్మకంగా, వినూత్న రీతిలో బోధించేందుకు వీలుగా అనుభవం ఉన్న ఉపాధ్యాయులతో స్థానిక బాలికల ఆశ్రమ పాఠశాలలో శిక్షణ ఇవ్వనున్నామని పేర్కొన్నారు.

అవకతవకలకు పాల్పడితే చర్యలు


గొట్టివలసలో పండ్ల తోటల మొక్కలను పరిశీలిస్తున్న ఉపాధి హామీ బృందం సభ్యులు

గరుగుబిల్లి: ఉపాధి హామీ పథకంలో అవకతవకలకు పాల్పడితే చర్యలు తప్పవని రాష్ట్ర ఉపాధి హామీ బృందం సభ్యులు పి.జానకీరావు, కె.సుధీర్ అన్నారు. మండలంలోని తోటపల్లి, చినగుడబ, గొట్టివలస గ్రామాల పరిధిలో వున్న ఎవెన్యూ పాంట్లేషన్, మొక్కల పెంపకాన్ని శుక్రవారం పరిశీలించారు. అనంతరం వారు మాట్లాడుతూ రాష్ట పంచాయతీరాజ్ కమిషనర్ ఆదేశాల మేరకు పార్వతీపురం మన్యం జిల్లాలో చేపడుతున్న ఉపాధి హామీ పనులను పరిశీలించడం జరుగుతుందన్నారు. పనులలో లోపాలను గుర్తించడంతో పాటు సక్రమంగా ఉన్న పనులపై నివేదికలను అందించడం జరుగుతుందన్నారు. పథకాన్ని సమర్థవంతంగా నిర్వహించేందుకు ప్రభుత్వం చర్యలు చేపడుతుందన్నారు. పరిశీలనలో ఏపీడీ జి.శ్రీహరిరావు, ఏపీఓ గౌరీనాథ్ తదితరులున్నారు.

చిరుధాన్యాల వాడకంపై విద్యార్థులకు అవగాహన



మాట్లాడుతున్న ఎంఈఓ-1 జి. సూరిదేముడు

సీతానగరం: పాఠశాల విద్యార్థుల ఆరోగ్య పరిరక్షణకు చిరుధాన్యాలు ఏవిధంగా దోహదపడతాయో బోధన సమయంలో ఉపాధ్యాయులు అవగాహన కల్పించాలని ఏంఈఓ-1,2 జి.సూరిదేముడు, ఎం. వెంకటరమణ కోరారు. ఈ మేరకు మండలంలోని ఉన్నత పాఠశాలల హెచ్ఎంలకు చిరుధాన్యాల వాడకం, వాటివల్ల విద్యార్థులకు ఒనగూరే ఆరోగ్య పరమైన అంశాలపై శుక్రవారం సీతానగరం ఉన్నత పాఠశాలలో అవగాహన సదస్సు నిర్వహించారు. కార్యక్రమంలో మండలంలోని ఆర్‌వెంకంపేట, నిడగల్లు, బూర్జ, గాదెలవలస, మరిపివలస, సీతానగరం ఉన్నత పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, సహోపాధ్యాయులు పాల్గొన్నారు.

వాడవాడలా అన్న సమారాధన


కురుపాం: ప్యాలెస్ వీధిలో అన్న సమారాధన


సీతంపేట: ఎస్టీ కాలనీలో అన్నదానం


భామిని: బత్తిలిలో అన్నసంతర్పణ

కురుపాం: మండల కేంద్రంలో ప్యాలెస్ వీధిలో వినాయక ఉత్సవాల్లో భాగంగా శుక్రవారం అన్న సమా రాధన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు. అంతకు ముందు వినాయక పూజల్లో భక్తులు పాల్గొన్నారు.

సీతంపేటలో...

సీతంపేట: వినాయక చవితి ఉత్సవాల్లో భాగంగా స్థానిక ఎస్టీ కాలనీలో అన్న సమారాధన శుక్రవారం జరిగింది. భారీ సంఖ్యలో భక్తులు పాల్గొని తీర్థ ప్రసాదం స్వీకరించారు.

భామినిలో...

భామిని: గణేశ్ ఉత్సవాల్లో భాగంగా శుక్రవారం పలుచోట్ల అన్న దాన కార్యక్రమాలు వినాయక ఉత్సవ కమిటీలు నిర్వహించాయి. బత్తిలిలో మూడుచోట్ల అన్న సమారాధన జరిగింది.

మహిళలు మరింత బలోపేతం కావాలి


మాట్లాడుతున్న వెలుగు పీడీ కిరణ్‌కుమార్

మక్కువ: మహిళలు ఆర్థికంగా మరింత బలోపేతం కావాలని వెలుగు పీడీ పి.కిరణ్‌కుమార్ అన్నారు. శుక్రవారం స్థానిక వెలుగు కార్యాలయంలో వీఓఏలు, సిబ్బందితో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, మహిళలు ఆర్థికంగా బాగుపడాలని, వ్యాపారవేత్తలుగా రాణించాలని ఆకాంక్షించారు. ప్రతి సభ్యురాలు ఆదాయం పెంచుకోవడానికి సరైన జీవనోపాధి ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఏపీఎం సన్నిబాబు, సీసీలు, వీఓఏలు పాల్గొన్నారు.

చురుగ్గా పూడికతీత పనులు


పెద్దూరు గ్రామంలో పూడికలను తొలగిస్తున్న కార్మికులు

గరుగుబిల్లి: మండలంలోని పెద్దూరు గ్రామంలోని పలు వీధులలోని కాలువలలో పేరుకుపోయిన పూడికలను ఉప సర్పంచ్ తెర్లి ఎల్లంనాయుడు పర్యవేక్షణలో తొలగిస్తున్నారు. కొండవీధిలోని కాలువలలో పూడికలు ఉండటంతో మురుగునీరు రహదారిపై నుండి ప్రవహిస్తుండటంతో ఈ మేరకు పూడికలను తొలగించేందుకు చర్యలు చేపట్టారు. తొలగించిన పూడికలను ట్రాక్టర్‌తో గ్రామం చివారుకు తరలించేందుకు ఏర్పాట్లు చేస్తున్నట్లు తెలిపారు. పంచాయతీల 15వ ఆర్థిక సంఘం నిధులతో పూడికలను తొలగిస్తున్నట్లు సచివాలయ సిబ్బంది పేర్కొన్నారు.

నేడు సామాజిక తనిఖీపై విచారణ

జియ్యమ్మవలస: మండలంలోని 31 పంచాయతీలలో ఈ నెల 2వ తేదీ నుండి నిర్వహించిన సామాజిక తనిఖీపై శనివారం ఉదయం 10 గంటలకు బహిరంగ విచారణ నిర్వహించనున్నట్టు ఎంపీడీఓ శ్రీనివాసరావు శుక్రవారం తెలిపారు. మండలంలోని ప్రజాప్రతినిధులు, సర్పంచులు, మండల అధికారులు హాజరు కావాలని కోరారు.

అలరించిన సత్యహరిశ్చంద్ర


హరిశ్చంద్ర పాత్రధారి శంకరరావును సన్మానిస్తున్న ప్రజాప్రతినిధులు, ఉపాధ్యాయులు

పాలకొండ రూరల్: స్థానిక కాశీవిశ్వేశ్వర ఆలయంలో శుక్రవారం ఏర్పాటు చేసిన సత్యహరిశ్చంద్ర కళారూపం ఆద్యంతం ఆకట్టుకుంది. రాష్ట్ర ఉత్తమ ఉపాధ్యాయుడు బౌరోతు శంకరరావు కాటి సీనులో హరిశ్చంద్రునిగా తనదైన అభినయంతో అలరించారు. ఈ సందర్భంగా సహచర ఉపాధ్యాయులు కె.జనార్దనరావు, కె.చౌదరినాయుడు, 4వ వార్డు కౌన్సిలర్ కొరికాన గంగునాయుడు తదితరులు హరిశ్చంద్ర పాత్రధారిని ఘనంగా సన్మానించారు. వృత్తితో పాటు కళలను ప్రోత్సహించటం, పలువురిని కళాకారులుగా తీర్చిదిద్దటంలో శంకరరావు చేస్తున్న కృషిని ఈ సందర్భంగా కొనియాడారు.

పాలకొండ రూరల్: నీలమ్మకాలనీలో కొలువుతీరిన గణనాథునికి 151 నైవేద్యాలు



వైభవంగా విఘ్నేశ్వర పూజలు

పాలకొండ రూరల్: పట్టణంలో కొలువుదీరిన విఘ్నేశ్వర మండపాల్లో స్వామి పూజలు వైభవంగా నిర్వహిస్తున్నారు. స్థానిక నీలమ్మ కాలనీలో కొలువదీరిన వరసిద్ధి వినాయక మండపంలో స్వామికి 151 నైవేద్యాలతో, 11,100 గరిక పూసలు, పసుపు కొమ్ములతో విశేష పూజలు శుక్రవారం నిర్వహించారు. పెద్దెత్తున్న మహిళలు, జెడ్పీటీసీ సభ్యులు పాలవలస గౌరీపార్వతీ పూజల్లో పాల్గొన్నారు. వడమ సత్యసాయి నగర్‌లో కొలువైన విజయ గణపతి తిరువీధి, నిమజ్జనోత్సవం వైభవంగా జరిగింది. స్వామివారికి నైవేద్యంగా పెట్టిన లడ్డూను వైశ్యరాజు దుర్గారావు దక్కించుకున్నారు.


పాలకొండ రూరల్: వరసిద్ధి వినాయక మండపంలో సామూహిక పూజల్లో పాల్గొన్న మహిళలు

లుంబేసులో వైద్య శిబిరం

గుమ్మలక్ష్మీపురం: మండలంలోని లుంబేసు గ్రామంలో రఫా ఫౌండేషన్, మధుశ్రీ హెల్త్‌కేర్ ఆధ్వర్యంలో శుక్రవారం ఉచిత వైద్య శిబిరాన్ని నిర్వహించారు. మధుశ్రీ హెల్త్‌కేర్ క్లినిక్ వైద్యులు రవికుమార్, ఆయా ఆరోగ్య సమస్యలతో బాధపడుతూ విచ్చేసిన 76మంది రోగులకు వైద్య పరీక్షలు చేశారు. మందులు అందజేశారు. వ్యాధులు ప్రబలకుండా జాగ్రత్తలు తీసుకోవాలంటూ పలు సూచనలు చేశారు. కార్యక్రమంలో రఫా ప్రతినిధులు ఎం.శోభనబాబు, జి.పెంటయ్య ఉన్నారు.

హస్త కళాకారులకు ప్రోత్సాహం


హస్త కళాకారుల ప్రోత్సాహక కార్యక్రమంలో సెరీకల్చర్ డైరెక్టర్ తదితరులు

పాలకొండ రూరల్: జౌళి శాఖ ద్వారా హస్త కళాకారులను ప్రోత్సహించేలా కేంద్ర ప్రభుత్వం అనేక పథకాలను అమలు చేస్తుందని విశాఖకు చెందిన సెరీకల్చర్ జాయింట్ డైరెక్టర్ పెంకి చంద్రజీవన్ అన్నారు. జౌళి మంత్రిత్వ శాఖ పరిధిలో గల డెవలప్‌మెంట్ కమిషనర్ హ్యాండ్‌క్రాఫ్ట్ సహకారంతో అపిట్‌కో లిమిటెడ్ (హెచ్‌వైడీ) వారు శుక్రవారం పాలకొండలో ఎంటర్‌ప్రెనైర్ డెవలప్‌మెంట్ కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా హాజరైన హస్తకళ సేవా కేంద్రం సహాయ డైరెక్టర్ లక్ష్మి, షేర్ డైరెక్టర్ పీడీ సుధీర్ కుమార్ తదితరులు ప్రభుత్వాలు అందిస్తున్న తోడ్పాటును వివరించారు. సదరు కళాకారులు ఈ పథకాలు అందిపుచ్చుకోవాలన్నారు. కార్యక్రమంలో న్యూహోప్ ఫౌండేషన్ చైర్మన్ బి.సుదర్శన్ బెనహర్, రీసోర్స్‌పర్సన్ పి.రవివర్మ, కోఆర్డినేటర్ అనిల్ తదితరులు హస్తకళల విశిష్టతను వివరించారు.

జిల్లా సైన్స్ సెమినార్‌కు గురుకుల విద్యార్థి


లక్ష్మీప్రసాద్‌ను అభినందిస్తున్న ప్రిన్సిపాల్ లక్ష్మణరావు, ఎంఈఓ-2 చిన తిరుపతిరావు


గుమ్మలక్ష్మీపురం: హారికతో ఎంఈఓలు


గరుగుబిల్లి: సెమినార్‌లో పాల్గొన్న విద్యార్థులు

కొమరాడ: జిల్లా స్థాయిలో జరగనున్న సైన్స్ సెమినార్‌కు గిరిజన సంక్షేమ గురుకులం బాలుర పాఠశాలకు చెందిన విద్యార్థి కె.లక్ష్మీప్రసాద్ ఎంపికయ్యారు. స్థానిక జెడ్పీ పాఠశాలలో మండల విద్యాశాఖ ఆధ్వర్యంలో శుక్రవారం మిల్లెట్ సూపర్ ఫుడ్ అనే అంశంపై జరిగిన సైన్స్ సెమినార్‌లో లక్ష్మీప్రసాద్ ప్రెజెంట్ చేసిన పోస్టర్ ప్రథమ స్థానంలో నిలిచింది. దీంతో జిల్లా సైన్స్ సెమినార్‌కు ఎంపికయ్యాడని ప్రిన్సిపాల్ డి.లక్ష్మణరావు తెలిపారు. కార్యక్రమంలో ఎంఈఓ 2 జి.చినతిరుపతిరావు తదితరులు పాల్గొన్నారు.

కేజీబీవీ విద్యార్థిని ప్రతిభ

గుమ్మలక్ష్మీపురం: స్థానిక జిల్లా పరిషత్ ఉన్నాత పాఠశాలలో నేషనల్ సైన్స్ సెమినార్ సందర్భంగా శుక్రవారం నిర్వహించిన మండల స్థాయి సెమినార్‌లో కేజీబీవీ విద్యార్థిని ఎల్.హారిక ఉత్తమ ప్రతిభ కనబర్చి ప్రథమ స్థానంలో నిలిచింది. సెమినార్‌కు మండలంలోని అన్ని ఉన్నత పాఠశాలలకు చెందిన విద్యార్థులు పాల్గొన్నారు. వీరిలో కేజీబీవీలో 9వ తరగతి చదువుతున్న హారిక మిల్లెట్స్ ఏ సూపర్ ఫుడ్ ఏ డైట్ ఫుడ్ అనే అంశంపై ప్రస్తావించి మండల స్థాయిలో మొదటి స్థానంలో నిలిచినట్లు ఎంఈఓలు బి.చంద్రశేఖర్, బి.జనార్దననాయుడు తెలిపారు. హారిక శనివారం జిల్లా కేంద్రంలో జరగనున్న జిల్లా స్థాయి సెమినార్‌లో పాల్గొననున్నట్టు ఎంఈఓలు చెప్పారు.

ప్రణీత ఎంపిక

గరుగుబిల్లి: జిల్లా స్థాయి నేషనల్ సైన్స్ సెమినార్‌కు జెడ్పీహెచ్ఎస్ తోటపల్లి గ్రామానికి చెందిన ఆర్.ప్రణీత ఎంపికైనట్లు ఎంఈఓ ఎస్.నాగభూషణరావు తెలిపారు. మండల కేంద్రంలో ఎస్ఈఆర్‌టీ ఆదేశాల మేరకు మండల స్థాయి సైన్స్ సెమినార్‌ను శుక్రవారం నిర్వహించారు. సెమినార్‌లో 8, 9, 10వ తరగతి విద్యార్థులు పాల్గొని మిల్లెట్‌ల ఆవశ్యకతపై ప్రదర్శనలు ఇచ్చారు. సెమినార్‌లో తోటపల్లి జెడ్పీ ఉన్నత పాఠశాలకు చెందిన ప్రణీత ఎంపికైనట్లు తెలిపారు. ఈమె శనివారం పార్వతీపురం మన్యం జిల్లాలో జరిగే జిల్లా స్థాయి సెమినార్‌లో పాల్గొంటారన్నారు.